# శోభనం నాటి చీర

శ్రీ కానాదిభట్ల వెంకటసుబ్బారావు

అందరికీ ఆ రోజు ద్వాదశి ఐతే నాకు మాత్రం ఏకాదశి అయింది. ఆఫీసరు చచ్చేటంతపని ఒప్పచెప్పటంవల్ల మధ్యాహ్నం ఇంటికి రావటానికి కూడా వీలుపడిందికాదు. చచ్చీ చెడీ చాకిరి ముగించుకొని ఆఫీసు వర్కులోంచి తప్పించుకొని కొంపకు చేరాను. కాని కథ అడ్డం తిరిగింది! గుమ్మంలో అడుగు పెట్టానో లేదో అప్పుడే విసవిసలూ బుసబుసలూ ఆరంభమయినయ్. ఈ రోజున ఏదో ప్రళయం ముంచుకొచ్చేట్టుందిరా గాడ్ అనుకుంటూనే కుర్చీలో చేరగిలబడ్డాను. ఎంతసేపు కూర్చున్నా కాఫీ అయినా తేలేదు సరికదా వాతావరణం అంతా గప్‌చప్‌గావుంది. ఇదివరకు నేను గుమ్మంలో ఎదురుపడగానే చిరునవ్వులతో స్వాగతమిచ్చే మా సీతాకోకచిలుక ఇవ్వాళ కంట్లో నలుసైపోయిందేమిటి చెప్మా. అని నాలో నేనే యుద్ధం చేసుకుంటూ కొంచెం చెవులు రిక్కించాను. వంటయింట్లో వస్తుసామగ్రికాబోలు ధనాధన్‌మంటున్నయ్. రెండు బాడీలు జారిపడిన శబ్దం కూడా వినిపించకపోలేదు. కడుపులో రాముడు మాడిపోతున్నాడు. కాఫీనీళ్ళయినా పడకపోతే జీవాత్ముడు ఏడిచిపోడూ మరి! సరే ఏమైతే అదయింది. వంటఇంట్లోకి పోయి సంగతేమిటో కనుక్కుందామని ధైర్యంచేసి లేవబోయి కూలబడ్డాను. ఇహ విధిలేక "ఇంట్లో వున్నావా?" అన్నాను.

"ఆ! వచ్చాను_" లోపలనుండి ఉరుము వినిపించింది. వులిక్కిపడ్డాను.

"హాలోస్మి!" అని చెవులు మూసుకున్నాను.

"మీకుమల్లే నాకు ఆఫీసా! వల్లకాడా! సాయంత్రమయ్యేసరికి కొంపకు చేరుకోటానికి?" కాఫీ గ్లాస్ మధ్య బల్లమీద పెట్టింది.

"ఏమిటీ లీలా! అంతకోపం? అపరాధం ఏదైనావుంటే చెప్పు! నీ చేత్తోనే చెంపదెబ్బ వేయించుకుంటాను.!"

"ఇదొక విద్య నేర్చుకున్నారు. మాట మాట్లాడితే చెంపదెబ్బ లంటూనూ!"

"ఇంతకూ..."

"ఏమిటని అడుగుతున్నారా పాపం! అవును మరీ. మీకు కావలసిన సిగరెట్ పెట్టెలూ, కాఫీ హోటళ్ళ ఖర్చులూ అయితే గుర్తుంటయికాని నే తెమ్మంది వచ్చినా గుర్తుండదు!"

"ఇంతకూ తమరేం ఆజ్ఞాపించారు రాణీగారూ?"

"అలా దారికిరండి రాజాగారూ! ఆఫీసు నుండి వచ్చేటప్పుడు 'క్రేప్ సిల్కుచీర' తెమ్మని మూడ్రోజులబట్టీ మొత్తుకుంటున్నానా! ఇదిగో తెస్తా అదుగో తెస్తానని కాలం గడిపేశారు. సంక్రాంతి పండగ్గదా! ఒక్కచీర తెచ్చి పెడదామని వుండొద్దూ. మీకు ఒక ముద్దూలేదు, ముచ్చటాలేదు అంతా నా ఖర్మ." కళ్ళమ్మట నీరు పొర్లుకుంటూ వస్తూనేవుంది.

ఆడవాళ్ళకు ఆగ్రహం వచ్చినా అనుగ్రహం వచ్చినా పట్టశక్యం కాదు. కంటనీరు రావటం మొదలైతే మగవాడు వోదార్చినకొద్దీ మరీ ఎక్కువైపోతుంది.

"ఓ! అదా సంగతి - ఐమీన్ ఆఫీసు గొడవలో పడి చీర సంగతి మరిచిపోయాను. I am very Sorry My dear Leela!"

"క్షమాపణలయితే చెప్పుకుంటారు కాని చీర సంగతి చెప్పరేం!"

"ఒకటో తారీకు..."

నాకదంతా తెలీదు. మీ ఖర్చులకయితే ఒకటో తారీఖు అక్కర్లేదు. నేను తెమ్మన్నదానికల్లా ఒకటో తారీకు పాపం! ఇన్ని సామాన్లుండగా మాయదారి దొంగలకు ఆ చీరే కావాల్సివచ్చింది. ఆ రోజు దొంగలుపడి నా చీర ఎత్తుకుపోయిన దగ్గర్నుంచీ నా మనసు మనసులో లేదు. ఆ నాటి క్రేప్ సిల్కు చీర కట్టుకుంటే నిజంగా నాకేదో మధురభావం హృదయంలో మెదులుతుంది. ఏమండీ నాకా సిల్కు చీర తెచ్చిపెట్టరూ!" దీనంగా చూస్తూ అడిగింది.

ఎంత గుండె నిబ్బరం కల మగరాయుడైనా అలా దీనంగా అడిగితే కాదంటానికి నోరొస్తుందా అంట? నాకు నవ్వాగింది కాదు. మా శ్రీమతి చిలిపితనం చూస్తాంటేను.

"ఆ చీరే కావాలంటావ్."

"అవును ఆ చీరే కావాలి!"

"అంత Cost పెట్టటమంటే మాటలా చెప్పు లీలా! నా మాట విని ఏదో సాదారకంతో..."

"ఎన్నో రకాలు తెచ్చి పెడుతున్నట్లు, ఇప్పుడీ రకం తేలేనట్లూనూ అన్నీ నంగనాచి కబుర్లు!" బుంగమూతి త్రిప్పింది.

"క్రొత్త పెళ్ళికూతురు వేంకాదుగా లీలా! శోభనం నాడు కట్టుకున్న ఆ చీరే కావాలంటే ఎలా చెప్పు! ఆ చీర కొస్తాకూస్తా ఖరీదుందా - రెండువందల రూపాయలు!"

"ఊహు నాకదే కావాలి! మరి తెచ్చిపెట్టరూ!"

నేను నవ్వుతూ-"శోభనం నాటి ఆ చీర ధరించి నాటి సిగ్గూ గిగ్గూ, బిడియం గిడియం అంతా పోగు చేసికొని నా ముందుకు రావాలనా? ఏ చీర కట్టుకున్నా గదిలోకి రానివ్వటానికి నా అభ్యంతరం ఏమీ లేదునుమా! ఏమంటావ్ శోభన పెళ్ళికూతురా!"

"అదే కావాలంటాను, పెళ్ళికొడుకుగారూ!"

"మరి తప్పదంటారా రాణీగారూ."

"తప్పదూ! తప్పదూ! తప్పదూ! తెలిసిందా! రాజాగారూ!"

శ్రీమతి బుగ్గమీద ఇలా చిటికవేసి అనుకోకుండా ముద్దుపెట్టేసుకున్నాను. నా చిలిపిసరసానికి తనకు రానికోపంతో మొగ్గలా ముడుచుకునిపోయింది. "పొండి! మీరు మరీనూ వేళాపాళా లేకుండా ఏమిటి మీ సరసాలూ_ఎవరైనా చూస్తే ఏమనుకుంటారూ!" బుగ్గమీద ఎంగిలి తుడుచుకుంటూ అంది.

"ఏమనుకుంటారూ! మొగుడు పెళ్ళాం సరసాలూ! సరదాలూనూ!"

"చాల్లెండి! స్నానంచేసి వేగిరమే రండి." అంటూ తుండు నా మొహాన పారేసి ఆఫీసురూంలోకి పారిపోయింది.

క్రిందటేడాదే మా పెళ్లయింది. పెళ్లి అయిన మూడోనాడే శోభనం కూడా చేసి పారేశారు, అప్పుడు నేను బి. ఏ. ఫైనలియర్‌లో వున్నాను. పెళ్లి మటుకు అపరాని పరిస్థితుల్లో చకాచిక్కీ అయిపోయింది. "వాడికి పరీక్షలుకూడా దగ్గర పడుతున్నయ్. తర్వాత శోభనం చెయ్యొచ్చులే! అది కూడా అయిపోతే వాడు కొత్త మోజులోపడి పరీక్ష సున్నా చుట్టేస్తాడు!" అన్నారు నాన్న. మా మామగారు మాత్రం "సింగినాదం జీలకర్రానూ కార్యం అయినంత మాత్రానే తప్పుతారా ఏంటి-! ఖర్చులో-ఖర్చు! ఆ ఒక్కటి మాత్రం తరుగెందుకూ! కానిద్దాం." అన్నారు.

"అయినా అబ్బాయిని కనుక్కోండి." అన్నాడా పెద్దమనిషి.

నాకు ఎక్కడలేని సిగ్గూ ముంచుకొచ్చింది. "పరీక్షలయింతర్వాతే ఆ గొడవంతానూ!" అన్నాను ఇష్టం లేనట్లు. తీరా అన్నతర్వాత నాలిక్కరుచుకున్నాను "కొంపతీసి వీళ్లు నా మాటప్రకారమే శోభనం వ్యవహారాన్ని వాయిదా వెయ్యరుకదా" అని మనసులోనే పిసుక్కు చచ్చాను. పెద్దవాళ్ల ఎదుట ఆ మాత్రం డాబుసరి ప్రదర్శించకపోతే నన్ను తేలిగ్గా చూస్తారు

మరి. మా బావమరిదిగాడు నిన్నింద్రీ మరీనూ. ఎక్కడా లేనివన్నీ వాడికే కావాలి! "గాభరా పడకు బావా శోభనం వాయిదా వెయ్యటంలే!" అని నవ్వుతూ తుర్రుమన్నాడు.

అంతా గప్‌చిప్‌గా జరిగిపోయింది. ఆనాడు ఆమె కట్టుకున్న చీరే నాకూ నచ్చింది. చాలా బావుందని పొగిడేశాను కూడా! మా ఆవిడ కేకవిని వులిక్కిపడి లేచి స్నానాలగది వైపు బైలుదేరాను.

భోజనంచేసి బట్టలు వేసుకున్నాను. మా శ్రీమతి తయారయింది. "ఇక వెళదామా!" అంటూ.

"గదిలో కాకి అల్ రైట్ నేనూ రెడీయే."

ఆ మాటకు నా చెంపమీద దెబ్బ తగలకుండా కొట్టి. "మరీ పసిపిల్లాడై పోతున్నారు!" అంది.

అయినా దానిదగ్గర డబ్బువుండి వుంటుంది అందుకే ఇంత దర్జాగా వెళదామా అంటుంది. నాదేంపోయింది అనుకొని 'పద!' అన్నాను.

బెసెంట్ రోడ్ సెంటర్‌లో షాపులన్నీ గాలించాం కాని దాని కిష్టమైన ఆ చీర దొరకలేదు. దేవుడా అంటూ టౌన్‌లోకి వెళ్లాం అక్కడ ఒక షాపులో ఆ చీర దొరికింది. "ఎంత" అంది.

"నూట ఎనభై ఎనిమిది రూపాయలు" అన్నాడు.

"అమ్మో అంత ధరే! ఇచ్చే ధర చెప్పు" అంది.

ఎలా అయితేనేం షాపువానితో యుద్ధంచేసి రెండు రూపాయలు తగ్గించింది.

వాడు పొట్లాం కట్టి ఇచ్చాడు.

"డబ్బివ్వండి!" అంది.

"నా దగ్గరలేదే నీ దగ్గరుందేమోనని నేనొట్టినే వచ్చాను...!"

"చాల్చాల్లెండి!" అంటూ నా జేబులో పర్సుతీసి కాషియర్‌కు డబ్బు ఇచ్చి రశీదు తీసుకుంది. రామరామ ఎంతపనిజరిగింది! మా ఆఫీసు ప్యూన్ ఇవ్వాళ్ల నాకు డబ్బు ఇచ్చి జాగ్రత్త చెయ్యమన్నాడు 'నా కొందు కిచ్చాడంటే 'డబ్బంటూ కొంపలో వుంటే ఆ చీరె కావాలి! ఈ చీరె కావాలి!' అని వాళ్లావిడ ప్రాణం తీస్తుందిట. అందుకని ఈ నెలలో కొంత తీసి నాకిచ్చి "నీ దగ్గిర దాయిరా భాయీ" అన్నాడు నేను "వద్దో" అన్నాను. వాడా వింటేనా! ఇంకేం ఇది కాస్తా మా శ్రీమతి ఖాళీచేసింది. వాడికెలా సమాధానం చెప్పాలో!

శ్రీమతి నన్ను వెనక్కి లాగింది. "మరీ అంత పరధ్యానమైతే ఎలా రోడ్డుమీద!" అంటూ.

సంక్రాంతి నాటిరాత్రి......

"ఏమిటి అంత పరాగ్గా వున్నారు?" అంటూ గదిలోకి వచ్చింది.

"అది కాదు లీలా! షాపుదగ్గిర నీకిచ్చినడబ్బు నాదికాదు నాఫ్రెండు నా దగ్గిర దాచిపెట్టమని!"

"ఓవ్ అదా సంగతి మరేం ఫర్వాలేదులెండి. మీ సంగతి తెలిసే నేను డబ్బు తెచ్చాను మీ దగ్గిరుండగా నా డబ్బు ఖర్చు పెట్టట మెందుకని మీ డబ్బే ఇచ్చేశాను. మీ కంతగా అవసరమైతే ఇస్తాలెండి."

"నీ దగ్గిర డబ్బెక్కడిదీ?"

"కొంత వెనకేశాను సరా? ఏమండీ!"

తల పైకెత్తి చూశాను. ఆ క్రేప్ సిల్కు చీర కట్టుకొని వచ్చేసరికి మా శ్రీమతి నిజంగా శోభనపు పెళ్లికూతురై వచ్చినట్లుంది. నాకు తమలపాకులు చుట్టి ఇస్తూ- "ఎలావున్నాను?" అంది నవ్వుతూ.

'అచ్చంగా; ఆనాటి శోభనపు పెళ్ళికూతురిలా వున్నావు! ఆ సిగ్గూ ఆ వయ్యారము తళుకూ బెళుకూ!'

"చాలెద్దురూ మీ పొగడ్త మరీనూ! మరి నాకు ఏం బహుమతి ఇస్తారు ఈ సంక్రాంతికి?" అంది నవ్వుతూ.

"ఇలా రా!" అంటూ దగ్గరకు పిలిచి, "శోభనపు పెళ్ళికూతురికి పెళ్లికొడుకిచ్చే బహుమతి ఇదే" అంటూ బుగ్గమీద గిల్లి పెదిమల నందించాను. ఆమె ముందుకు జరిగి నా హృదయంలో చోటు చేసుకుంది.